2002 బెస్ట్ సెల్లర్, **మైండ్‌మేజిక్** రచయిత

**డా॥ బి.వి. పట్టాభిరామ్** Ph.D.

# నాయకత్వ లక్షణం విజయానికి తొలిమెట్టు

ఎమెస్కో

# ఇందులో...


| | |
|---|---|
| నాయకత్వ లక్షణాలు మీకున్నాయా? | 5 |
| సమర్థ నాయకత్వం | 11 |
| నాయకుల సద్గుణాలు | 19 |
| నాయకులారా! శరీరభాష తెలుసా? | 25 |
| మీ సామర్థ్యం మీకు తెలుసా? | 31 |
| నాయకుడిగా మీ సామర్థ్యం ఎలా ఉంది? | 37 |
| సెల్‌ఫోను భాగోతం | 43 |
| సమర్థులు-అసమర్థులు | 49 |
| గాంధీజీ నాయకుడెలా అయ్యారు? | 55 |
| మీ ప్రేరణ ఎలా ఉండాలి? | 61 |
| గెలుపు మీదే | 69 |
| మీరు గెలవాలనుకుంటున్నారా? | 73 |

# నాయకత్వ లక్షణాలు మీకున్నాయా?

నాయకుడు అంటే రాజకీయనాయకుడనే కాదు ఒక సంస్థను అభివృద్ధి పరచడానికి, తగినకృషిచేస్తూ, సాటివారిలో ప్రేరణ కలిగిస్తూ ముందుకు తీసుకుపోయేవ్యక్తి. సంస్థ ప్రగతికి అనుక్షణం ఆలోచిస్తూ అందరినీ సమీకరిస్తూ, తన ఆలోచనలను సభ్యులకర్థమయ్యేలాచెప్పి వారినికూడా అదేవిధంగా ఆలోచించేలాచేసి, అభివృద్ధిపథంవైపు సాగిపోయేలా చేయడమే నాయకుడి ప్రథమలక్షణం. 20వ శతాబ్దపు "అత్యన్నతమేనేజరు" అనే అవార్డును, అమెరికాలోని 'ఫార్చ్యూన్'అనే పత్రికనుండి అందుకున్న జాక్‌వెల్ష్, నాయకత్వానికి కొన్ని అద్భుతమైన చిట్కాలు అందించారు. అవి మనంకూడా తెలుసుకుందాం. జాక్‌వెల్ష్ అమెరికాలోని జనరల్ ఎలక్ట్రికల్ కంపెని (జి.ఇ)కి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా (సిఇఓ) చాలాకాలం పనిచేసి అపారమైన లాభాలు, కీర్తి సంపాదించిపెట్టారు. 125 ఏళ్లక్రితం థామస్ అల్వా ఎడిసన్ ప్రారంభించిన జి.ఇ. సంస్థ 1981లో లాభాలగాడి తప్పబోయింది. ఆ సమయంలో ఛైర్మన్, సి.ఇ.ఓ.గా ఛార్జి తీసుకున్నాడు. 25 బిలియన్ల వ్యాపారాన్ని 112 బిలియన్లకు పెంచాడు. రెండుబిలియన్లలోపే ఉన్న నికరలాభాన్ని 11 బిలియన్లకు పెంచాడు. దీనికి ఆయన ఇచ్చిన సమాధానం ఒక్కటే.

"నాయకుడుకూడా మార్పుని ఆచరణలో పెట్టాలి, ఇది ఈనాటి నినాదం. నిన్నటిదాకా అందరూ మార్పుగురించి మాట్లాడినా, అది ఇతరులకు మాత్రమే వర్తిస్తుందనీ ఇతరులు మారాలని అనుకునేవారు కానీ ఇప్పుడు ముందుగా లీడరు మారాలి. లీడరు మారి చూపించిన తర్వాత ఇతరులను అనుసరించమని చెప్పాలి. అప్పటికీ మారకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి." అంటాడు జాక్‌వెల్ష్. రాజకీయాల్లో, కార్పొరేట్ రంగాల్లో ఇతరసంస్థల్లో లీడర్లు తాము మారి విజయం సాధిస్తున్న సందర్భాలు మనం చూస్తూనేఉన్నాం. లీడర్లుమారక, సంస్థలు మూతపడుతున్న వైనాలు మనంచూశాం. మనరాష్ట్రంవరకు చూస్తే, అద్భుతప్రగతిసాధించి, అనూహ్యలాభాలు ఆర్జించిపెట్టిన కొన్నిసంస్థలు, అధికారుల్లో నాయకత్వ లక్షణాలు లోపించినందువల్ల, అవినీతి అలుముకోవడంవల్ల ఆయోమయస్థితిలో పడి, చివరకు అంతరించిపోయాయి. ఈ వాస్తవం ఎవరూ కాదనలేరు కానీ అటువంటివారిని రాబోయే తరం క్షమించదు.

ఇపుడు రోజులు మారాయి. ప్రభుత్వపు పాలసీలు మారుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలు మూలబడుతున్నాయి. ప్రతివ్యక్తి ఒకశక్తిగా మారి, సమాజానికి తానేం చెయ్యగలనని ఆలోచించే పరిస్థితి వచ్చింది. ఈమార్పుకి సిద్ధపడి, మీరు ఏరంగంలో స్థిరపడినా విజయం సాధించడానికి ఈ సిద్ధాంతాలను పాటించండి.

**నాణ్యమైన నలభై నాయకత్వ లక్షణాలు ఇవిగో?**

1. ముందుగా లీడరు మారడానికి సిద్ధపడాలి. సంస్థ ప్రగతి గురించి తనవైఖరిని మార్చుకోవాలి.
2. సహచరులను మారమని వత్తిడి చేయడంకన్నా మార్పువల్ల వచ్చే లాభాలను చెప్పాలి.

3. లీడరు కూడా ఒక ఉద్యోగే. తనకు నాయకత్వం కట్టబెట్టినందువల్ల అధికుడిననే ఆలోచన రాకూడదు.
4. నాయకుడు సహచరులకు దగ్గర కావాలంటే ప్రత్యేక కాబిన్ విడిచిపెట్టి, అందరిలాగా కూర్చోవడం మంచిది.
5. సహచరుల్లో ఎవరు ఏ రంగంలో నిష్ణాతులో గుర్తించి వారికి ఆపని అప్పగించాలి.
6. తనలోని లోపాలను సరిదిద్దుకుంటూ, వాస్తవాలని అంగీకరించి, తగు చర్యలు తీసుకుంటూ ఉండాలి.
7. పొగడ్త అందరికీ ఇష్టమే. కానీ అతిగా పొగిడే మనుషులను దూరంగా ఉంచడం నాయకుడికెంతో శ్రేయస్కరం.
8. సమస్యలను నాయకుడికి చెప్పేముందు సంబంధిత మేనేజర్లు తాము అందించే పరిష్కారాలతో రావాలని చెప్పాలి.
9. పూర్వంరోజుల్లోలాగ నాయకుడంటే సుప్రీమ్ అధికారి కాదని గుర్తించాలి. రేపు మరో సహచరుడు ఆ స్థానంలోకి రావచ్చు.
10. సరిగ్గా పనిచేయనివారు ఆత్మీయుడైనా, చివరకు తమ్ముడైనా పక్కకు పెట్టాలి. లేదా ఇతరులకు దూరంకాక తప్పదు.
11. అవసరమైనంత సిబ్బందినే నియమించుకోవాలి. పనిలేనివారిని 'డౌన్‌స్టెండింగ్' ప్రక్రియలో పంపకతప్పదు.
12. సంస్థలో దాదాపు ప్రతివ్యక్తిపేరు గుర్తుపెట్టుకోవడం ఒక మంచి లక్షణం. వారు నాయకుడికి దగ్గరవుతారు.
13. ఎవరిమీదైనా మేనేజరుకి ఫిర్యాదు అందినప్పుడు ఆ వ్యక్తితో మాట్లాడి నిజానిజాలు తెలుసుకోవాలి.

14. సంస్థ పరిపాలనకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సేకరిస్తూ ఉండాలి. లేదా మేనేజర్లు కాకుల లెక్కల మీద ఆధారపడాల్సి వస్తుంది.
15. ప్రజలు, కస్టమర్స్‌తో సత్సంబంధాలుండాలి. అవసరమున్నా లేకపోయినా వారిని కలుస్తూ ఉండాలి.
16. లీడరు కూడా మనిషే. అతనికి కూడా కోపావేశాలుంటాయి. కానీ వాటిని అదుపులో పెట్టుకోకతప్పదు. అవసరమైతే నటించాలి తప్ప నిజంగా ప్రదర్శిస్తే ఇద్దరికీ నష్టమే.
17. ప్రత్యర్థుల కదలికలను జాగ్రత్తగా గమనిస్తుండాలి. వారు ఒక ఎత్తు వేసేలోగా, నాయకుడు దానిని చిత్తుచేయాలి.
18. పూర్వంరోజుల్లో నాయకుడంటే అందరూ భయభక్తుల్తో ఉండేవారు. ఇప్పుడు అది పనికిరాదు. నాయకుడు సరదాగా నలుగురితో కలిసిపోవాలి. లేదా ఎవడో చాపకిందకు నీరు తెస్తాడు.
19. నాయకుడు ఏదైనా సాధించినపుడు తృప్తిఉండాలితప్ప, అది అహంకారంగా మారకూడదు.
20. ఎంత ఎత్తుకి ఎదిగినా ఇంకా చాలా సాధించాలనే లక్ష్యం వేధిస్తూ ఉండాలి.
21. ప్రతిరోజూ పని ప్రారంభించేముందు “ఈరోజే మొదటిరోజు, నేను జాగ్రత్తగా నేర్చుకోవాలి” అనుకోవాలి.
22. గతంలో సాధించిన విజయాలు రేపటికి పనికొస్తాయని అనుకోవద్దు. రేపటికొరకు ఈరోజు కూడా పనిచేయాల్సిందే.
23. సంస్థలో పనిచేసేవారు విజయం సాధించినప్పుడు, తప్పనిసరిగా అందరిముందు అభినందించాలి. అది ఇతరుల్లో స్ఫూర్తి కలిగిస్తుంది. ప్రోత్సాహకాలు అద్భుతాలు చేయగలవు.